

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

పద్మశాలీల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే కాలేరు

రాంనగర్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలోని పద్మశాలీల అభివృద్ధి, సంక్షేమానికి సహకారం అందిస్తామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శివం రోడ్‌లోని న్యూ ఆజామ్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన అంబర్‌పేట నియోజకవర్గం పద్మశాలి సంఘం కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. పద్మశాలీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. పద్మశాలి సంఘం నూతన భవనం నిర్మిస్తే దానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమానికి సంఘం అధ్యక్షుడు వర్కాల కృష్ణ, ప్రధాన కార్యదర్శి చిలుక శివకుమార్, కోశాధికారి అశోక్‌లు అధ్యక్షత వహించగా అఖిల భారత పద్మశాలి సంఘం ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షుడు డాక్టర్ పుట్ట పాండురంగయ్య, తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మార్తా రమేష్, నాయకులు తాటికొండ వెంకటరాజయ్య, నక్క రమేష్, ఏ. అంజయ్య జి. సత్తయ్య, గంజి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న షార్ట్ హ్యాండ్ కంప్యూటర్ అసోసియేషన్ నేతలు

గ్రూప్-3, 4 నోటిఫికేషన్‌లో టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులను పెంచాలి

నల్లకుంట, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగిందని తెలంగాణ రికగ్నైజ్డ్ టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ కంప్యూటర్ అసోసియేషన్ నేతలు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా గ్రూప్-3, 4 నోటిఫికేషన్‌లో టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులను పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డికి వారు విజ్ఞప్తి చేశారు. జనవరి నెలలో తమిళనాడులో 2 వేల టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులను అక్కడి ప్రభుత్వం ప్రకటించి నిరుద్యోగులను ఆదుకుందని వారు గుర్తు చేశారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ రికగ్నైజ్డ్ టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ కంప్యూటర్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ బాలిగ, ప్రధాన కార్యదర్శి వెంకటేశం, కోశాధికారి వివేక్‌లు మాట్లాడారు. గ్రూప్-3, 4 నోటిఫికేషన్లలో ప్రభుత్వం టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులు పెంచాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు శ్రీకృష్ణ

అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

నల్లకుంట, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): నాగర్ కర్నూలు జిల్లా మొలచింతలపల్లి గ్రామానికి చెందిన చెంచు మహిళపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలన్నారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇసుక మాఫియా గుండాలు మహిళపై అత్యాచారం చేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పోలీసులు కొందరిపై కేసు నమోదు చేసి మిగతా వారిని వదిలివేయడం అన్యాయం అన్నారు. బాధిత మహిళ ఈశ్వరమ్మ కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో మాలమహానాడు నాయకులు ప్రసాద్, సుధాకర్, వీరన్న, శివుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై నెలకొల్పాలి

- గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షుడు నారాయణగౌడ్

బర్కత్‌పుర, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఆగస్టు 18 నాటికి సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై నెలకొల్పాలని గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం గౌడ ఐక్య సాధన సమితి స్టీరింగ్ కమిటీ సమావేశం భిక్షపతిగౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సర్వాయి పాపన్నగౌడ్ జయంతి నాటికి విగ్రహ ఏర్పాటు పనులు పూర్తి కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఇందిరాగౌడ్, నర్సింహగౌడ్, రాజుగౌడ్, లింగయ్యగౌడ్, ఈశ్వరయ్యగౌడ్, ఆంజనేయులుగౌడ్, బాలకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీమాన్ ఆశ్వాపురం వేణుమాధవ్, తదితరులు

పరిచయ వేదికను సద్వినియోగం చేసుకోవాలి

- తెలంగాణ చాత్తాద శ్రీవైష్ణవ సంఘం

నల్లకుంట, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): చాత్తాద శ్రీవైష్ణవ పరిచయ వేదిక కార్యక్రమం ద్వారా తెలంగాణ రాష్ట్రంతోపాటు దేశంలోని ఏపీ, కర్నాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల వారు సద్వినియోగం చేసుకుంటున్నారని తెలంగాణ చాత్తాద శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీమాన్ ఆశ్వాపురం వేణుమాధవ్ అన్నారు. ఆదివారం నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్‌లోని చాత్తాద శ్రీవైష్ణవ కేంద్ర కార్యాలయంలో చాత్తాద శ్రీవైష్ణవ పరిచయ వేదిక కార్యక్రమం జరిగింది. ఈ పరిచయ వేదికలో వివిధ రాష్ట్రాలకు చెందిన 300 మందికిపైగా జంటలు పాల్గొని తమ పరిచయాలను చేసుకుని వధూవరులను ఎంపిక చేసుకునే ప్రయత్నం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ధర్మపురి శ్రీనివాస్, తులసి సత్యనారాయణ, వెంకటయోగి వెంకటేశ్వర్లు, తిరుక్కోవల్లూరు కృష్ణస్వామి, వకుళాభరణం సంతోషాచార్యులు, వెంకటేశ్వరరావు, వెంకటరమణ, తిరునగరి విష్ణు చిత్తస్వామి, పాండు, రవీందర్, ప్రభాకర్, జనార్థన్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌ల పెంపు అమలు చేయాలి: ఎన్‌పీఆర్‌డీ

చిక్కడపల్లి, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): ఆసరా, చేయూత పెన్షన్‌ల పెంపును అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేస్తామని దివ్యాంగుల హక్కుల జాతీయవేదిక(ఎన్‌పీఆర్‌డీ) ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కె. వెంకటయ్య, అడివయ్యాలు ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు వేల పెన్షన్‌ను నాలుగు వేలు, నాలుగ ువేల పెన్షన్‌ను ఆరువేలు చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడుస్తున్నా కూడా ఆ మాటే ఎత్తడంలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా పెన్షన్‌ల పెంపు హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

చిక్కడపల్లి, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌పరిధిలో ఉన్న అనేక హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని డివిజన్ తెలంగాణ జనసమితి కన్వీనర్ గుండెల్లి రవీందర్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు. నేరాల అదుపునకు ప్రతి ఒక్క వ్యాపార సంస్థతోపాటు హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా హాస్టళ్ల నిర్వాహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా వారిలో అవగాహన తీసుకురావాలన్నారు. మెయిన్‌రోడ్ నుంచి రెండు కిలోమీటర్ల లోపలి ప్రాంతంవరకు కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా కృషి చేయాలని రవీందర్‌యాదవ్ చిక్కడపల్లి, ముషీరాబాద్ పోలీసులకు విజ్ఞప్తి చేశారు.



ఇందిరాపార్కు చౌరస్తాలో శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులర్పిస్తున్న ముషీరాబాద్ కన్వీనర్ రమేష్‌రాం, కార్పొరేటర్ రచనశ్రీ, తదితరులు



కాచిగూడ నింబోలిఅడ్డలో డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ తదితరులు - బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి



బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణగౌడ్, అధికార ప్రతినిధి ఏడెల్లి అజయ్‌కుమార్, నాయకులు నందకిషోర్‌యాదవ్, కన్నె రమేష్‌యాదవ్, కార్పొరేటర్లు కన్నె ఉమారాణి, వై. అమృత తదితరులు - బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

శ్యామాప్రసాద్ ముఖర్జీకి నివాళి

కవాడిగూడ, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ దేశభక్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పలువురు బీజేపీ నేతలు పిలుపునిచ్చారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ గొప్ప దేశభక్తుడు, జాతీయ వాది, హిందుత్వవాది అని కొనియాడారు. ఆదివారం శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకొని కవాడిగూడ డివిజన్ బీజేపీ కమిటీ అధ్యక్షుడు మహేందర్‌బాబు ఆధ్వర్యంలో ఇందిరాపార్కు చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కార్పొరేటర్ రచనశ్రీ, ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ రమేష్‌రాం ముఖ్య అతిథులుగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టికల్ 374, గోవధ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమించారని కొనియాడారు. దేశానికి రెండు ప్రధానులు, రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు ఉండరాదని ఆనాడే నినదించారని వారు గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రవీందర్, డివిజన్ బీజేపీఅధ్యక్షుడు మహేందర్‌బాబు, బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, పరిమళ్‌కుమార్, రాంరెడ్డి, రంగ రాజాగౌడ్, వెంకట్‌రెడ్డి, రఘునాద్, మహేష్, గంటా శ్రీనివాస్, ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు, నందు, చిత్రకుమార్‌గౌడ్, రమేష్‌గౌడ్, దిలీప్‌యాదవ్, శివరాజ్‌తోపాటు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రచార కార్యదర్శి జి.మల్లేష్ ఆధ్వర్యంలో బాగ్అంబర్‌పేట అయ్యప్పటెంపుల్ రోడ్‌లో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, పార్టీ నాయకులు సి.కృష్ణాగౌడ్, శ్యామ్‌రాజ్, చుక్క జగన్, అజయ్, రాజేష్, మోహన్‌కృష్ణ, గోవర్ధన్‌రెడ్డి, ధనుంజయ, వెంకటేష్‌గౌడ్ తదితరులు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళుర్పించారు. -గోల్నాక, ఆంధ్రజ్యోతి



నల్లకుంటలో డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి మాజీ కార్పొరేటర్ వనం రమేష్, నల్లకుంట కార్పొరేటర్ వై. అమృతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. - నల్లకుంట, ఆంధ్రజ్యోతి



బీజేవైఎం గోల్నాక డివిజన్ అధ్యక్షుడు సింగీతం రాజేష్ ఆధ్వర్యంలో గంగానగర్‌లో బీజేపీ నేతలు పాల్గొని డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. -గోల్నాక, ఆంధ్రజ్యోతి



అంబర్‌పేట పటేల్‌నగర్ చౌరస్తాలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు దాసోజు నాగభూషణ్ ఆధ్వర్యంలో బీజేపీ నేతలు శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు



సమావేశంలో మాట్లాడుతున్న చత్తీస్‌గఢ్ పీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ దీపక్ బైజ్, తదితరులు

ఆదివాసీలను చంపడం దారుణం

- చత్తీస్‌గఢ్ పీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ దీపక్ బైజ్

రాంనగర్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆదివాసీలను నక్సలైట్ల పేరుతో చంపడం దారుణమని చత్తీస్‌గఢ్ పీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ దీపక్ బైజ్ అన్నారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో చత్తీస్‌గఢ్‌లో ఆదివాసీల హత్యాకాండను నిలిపివేయాలి అనే అంశంపై విస్తృతస్థాయి సమావేశం ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన దీపక్ బైజ్ మాట్లాడుతూ బస్తర్, చత్తీస్‌గఢ్‌లో ఆదివాసీలను నక్సలైట్ల పేరుతో ఎన్‌కౌంటర్లు జరిగాయని ఆరోపించారు. గిరిజనులను నక్సలైట్లుగా ముద్రవేసి కాల్చి చంపుతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ నాయకత్వంలో ఆదివాసీల హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. మోదీ ప్రభుత్వం అగ్రవర్ణాలు, కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐసీసీ ఆదివాసీ వైస్ చైర్మన్ డాక్టర్ తేజావత్ బెల్లయ్య నాయక్, ప్రముఖ సాహితీవేత్త శివారెడ్డి, నాయకులు నారాయణ, గోవర్ధన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



రాంగ్ సైడ్ డ్రైవింగ్‌లో స్వాధీనం చేసుకున్న వాహనాలు, డ్రంకెన్‌డ్రైవ్‌లో పాల్గొన్న పోలీసులు

ఉల్లంఘనులపై ఉక్కుపాదం

- కేసుల నమోదు.. వాహనాల సీజ్

హైదరాబాద్ సిటీ, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): అతివేగం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, మద్యం మత్తులో వాహనాలు నడపడం, నిబంధనలు పాటించకపోవడం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా గుర్తించిన సైబరాబాద్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి పలువురిపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశారు. ఆదివారం రాంగ్‌సైడ్ డ్రైవింగ్ చేస్తున్న వారిపై 22 కేసులు నమోదు చేసి, 114 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్‌పై ఇప్పటివరకు 122 కేసులు నమోదు చేసి, 631 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేసేందుకు అవకాశమున్న ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, ఆన్‌లైన్‌లో చలాన్లు విధించే దిశగా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో..

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 385 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. సీజ్ చేసిన వాహనాల్లో 292 బైకులు, 11 ఆటోలు, 80 కార్లు ఉన్నాయి. 182 కేసులు కేవలం ఐటీ కారిడార్‌లోనే ఉన్నాయని తెలిపారు.



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని సన్మానించిన ఎంఆర్‌పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం అధ్యక్షుడు రాజశేఖర్ మాదిగ, బీజేపీ నాయకులు

దళితుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం కృషి

- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

ముషీరాబాద్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా దళితుల అభ్యున్నతికి ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ముషీరాబాద్ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్ మాదిగ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకులు గండి కృష్ణ, రాష్ట్ర నాయకులు రాములు, దశరథ్, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రాం, జాయింట్ కన్వీనర్ మహేష్‌కుమార్, బీజేవైఎం నియోజకవర్గం కన్వీనర్ గడ్డం నవీన్ తదితరులు పాల్గొన్నారు.



తొలుపునూరి కృష్ణగౌడ్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ రోహిణ్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తొలుపునూరి కృష్ణగౌడ్

రాంనగర్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు తొలుపునూరి కృష్ణగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ సి. రోహిణ్‌రెడ్డి ప్రకటించి ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రోహిణ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం అంకితభావంతో పనిచేసేవారికి పార్టీలో గుర్తింపు లభిస్తుందని, ఇందుకు తొలుపునూరి కృష్ణగౌడ్ నిదర్శనమని అన్నారు. ప్రధాన కార్యదర్శిగా నియమితులైన తొలుపునూరి కృష్ణగౌడ్ మాట్లాడుతూ గడచిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అంకితభావంతో పనిచేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి లక్‌పతి యాదగిరి, రాష్ట్ర కనీస వేతనాల సలహాబోర్డు మాజీ వైస్ చైర్మన్ బి. నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

రెండు లక్షల రుణమాఫీ నిర్ణయంపై హర్షం

చిక్కడపల్లి, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణాలో రెండు లక్షల రుణమాఫీని ఆగస్టు లోపు చేస్తామని కేబినెట్ మీటింగ్‌లో ఆమోదించడం పట్ల తెలంగాణ బీసీ ఐక్యవేదిక హర్షం ప్రకటించింది. ఆదివారం సాయంత్రం చిక్కడపల్లిలో ఐక్యవేదిక సమావేశం జరిగింది. అధ్యక్షత వహించిన ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మహేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన మాట ఇచ్చి నిలబెట్టుకుంటున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న బీసీలకు సముచితస్థానం కల్పించాలని కోరారు.



హరినగర్‌లోని శ్రీపోచమ్మ దేవాలయం వార్షికోత్సవంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, తదితరులు

పోచమ్మ ఆలయ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే ముఠా గోపాల్

రాంనగర్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్ హరినగర్‌లోని పోచమ్మ ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. ఆదివారం ఆలయ 5వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకలకు ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే బోనాల వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలని సూచించారు. శ్రీపోచమ్మ ఆలయ అభివృద్ధికి భక్తులు, దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రమేష్, కమిటీ సభ్యులు పెండ్యాల రవి, గడ్డం నవీన్, గజ్జల శ్రీనివాస్, ప్రసాద్, రాకేష్, చంద్రవాస్, బీఆర్ఎస్ నాయకులు టి. శంకర్ ముదిరాజ్, వరుణ్, నేరెళ్ల అరవింద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిక్కడపల్లిలో ఉచిత డయాబెటిక్ క్యాంప్

చిక్కడపల్లి, జూన్ 23(ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హెల్త్ సిటి, సెన్సాకోర్ మెడికల్ ఇన్‌స్టుమెంటేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చిక్కడపల్లిలో ఉచితంగా డయాబెటిక్ క్యాంప్ నిర్వహించారు. లయన్స్‌క్లబ్ డయాబెటిస్ విభాగం చైర్మన్ డా. జీకే రమణ పర్యవేక్షణలో చిక్కడపల్లిలోని శ్రీ సాయి డయాగ్నస్టిక్ కేంద్రంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు శిబిరం నిర్వహించగా 170 మంది పరీక్షలు చేయించుకున్నారు. వారికి ఉచితంగా మందులు కూడా అందజేశారు. ఈనెల 30న లయన్స్‌క్లబ్ కార్యవర్గం కాలపరిమితి ముగియనున్నందున నగరంలో 10 వేల మందికి ఈ పరీక్షలు నిర్వహించే లక్ష్యంలో భాగంగా ఈ శిబిరం జరిగిందని నగరంలో నలభై క్లబ్‌ల ఆధ్వర్యంలో శిబిరాలు జరిగాయని రమణ వివరించారు. లయన్స్‌క్లబ్ సభ్యులు రాజశేఖర్, మల్లేశ్వర్, సాయిరితీష్, కొండ్లె రఘు తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు గనుల వేలం విరమించుకోవాలి

- ప్రధాని మోదీకి ఎంపీ ఆర్. కృష్ణయ్య లేఖ

రాంనగర్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): దేశంలోని 60 బొగ్గు గనులను వేలం వేయాలనే కేంద్ర ప్రభుత్వం ఆలోచనను వెంటనే విరమించుకోవాలని కోరుతూ ప్రధాని మోదీకి రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య ఆదివారం లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని బొగ్గు గనులను సింగరేణి సంస్థకు అప్పగించాలని మోదీని కోరారు. బొగ్గు గనుల వేలం వల్ల ప్రభుత్వానికి ఉద్యోగులకు నష్టం కలుగుతుందన్నారు. బొగ్గు గనుల వేలం వల్ల జాతి సంపద ప్రైవేట్ బడా పారిశ్రామికవేత్తల శక్తుల్లోకి వెళ్తుందన్నారు. వేలం వేయడం అంటే చట్టబద్ధంగా దోచుకోవడానికి లైసెన్స్ ఇవ్వడమే అవుతుందన్నారు. వేలం వేయడం ప్రైవేటీకరణలో భాగమన్నారు. ప్రైవేటీకరణ వల్ల రాజ్యాంగబద్ధమైన ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఉండవని లక్షలాది ఉద్యోగాలు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు దక్కకుండా పోతాయని మోదీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. బొగ్గు గనుల వేలం ఆపాలని ప్రధాని మోదీని కలుస్తామన్నారు.



వీఎస్టీ చౌరస్తాలో రోడ్డుపై నిలిచిపోయిన వర్షం నీరు

ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి వీఎస్టీ నుంచి రాంనగర్ వెళ్లే మెయిన్‌రోడ్‌లో గల వీఎస్టీ మెయిన్ రోడ్డులో వర్షం నీరు మోకాలిలోతు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు, పాదచారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జీహెచ్‌ఎంసీ సిబ్బంది సకాలంలో స్పందించకపోవడం వల్ల రాత్రి వరకు నీరు రోడ్డుపై నిలిచి ఉంది.ట్రాఫిక్ పోలీసులు వాహనాలను దారిమళ్లించారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి

డీడీఎంఎస్‌లో వివిధ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రాంనగర్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ ఒకేషనల్ కోర్సు సెంటర్‌లో పలు కోర్సులకు ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్సు కోర్సు), ఆపరేషన్ థియేటర్ టెక్నిషియన్, డయాలసిస్ అసిస్టెంట్, తదితర కోర్సుల్లో సర్టిఫికెట్ కోర్సులను అందించనున్నట్లు పేర్కొన్నారు. డయాలసిస్ అసిస్టెంట్ కోర్సుకు కనీస అర్హత ఇంటర్మీడియట్, మిగిలిన కోర్సులకు 10వ తరగతి అర్హత అని తెలిపారు. అన్ని వయసుల వారు ఈ కోర్సులో చేరేందుకు అర్హులన్నారు. జూలై 5వ తేదీలోగా వివిధ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కాగా, ఆసక్తి గలవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఫోన్ నంబరు 8309037134, 6305895867లలో సంప్రదించాలన్నారు.

బాధితుడి ఫిర్యాదుపై అలసత్వం

నాగోల్ ఎస్‌హెచ్‌ఓపై చర్య

- సీపీ ఆఫీస్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు

కొత్తపేట, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): బాధితుడి ఫిర్యాదుపై అలసత్వం వహించిన నాగోల్ ఎస్‌హెచ్‌ఓ పరశురాంను ఈ నెల 22న సీపీ ఆఫీస్‌కు తాత్కాలికంగా అటాచ్ చేస్తూ సీపీ తరుణ్‌జోషి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 2న ఎల్‌బీనగర్, ఎన్టీఆర్‌నగర్‌లో సాయినగర్ కాలనీకి చెందిన వి.మల్లేష్, నరేష్, ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన అనిల్, సాయినగర్‌కు చెందిన జ్యోతి, నాగరాజు, నాగోల్‌కు చెందిన పీ.మనోజ్, సాయినగర్ కాలనీకి చెందిన శశాంక్, సాయినగర్ గుడిసెల్లో ఉండే పవన్‌కుమార్‌తోపాటు మరో ఇద్దరు బాలలు, భరత్‌నగర్‌కు చెందిన దాసరి గౌతం అలియాస్ బద్దు (20) మధ్య గొడవ జరిగింది. గాయపడ్డ గౌతం ఈ నెల 21న నాగోల్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌హెచ్‌ఓ పరశురాం కేసు నమోదు చేయడంలో అలసత్వం వహించడంతో బాధితుడు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సీపీ తరుణ్ జోషి. పరశురాంను కమిషనరేట్‌కు అటాచ్ చేశారు. ఫిర్యాదుపై స్పందించడంలో అలసత్వం వహించిన ఎస్ఐ మధు, ఏఎస్ఐ అంజయ్యపై కూడా సీపీ చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎల్‌బీనగర్ డీఐ సుధాకర్‌ను తాత్కాలికంగా నాగోల్ ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహించాలని సీపీ ఆదేశాలు జారీ చేశారు.

సాయినగర్‌లో ఏం జరిగిందంటే..

ఎల్‌బీనగర్‌లోని ఎన్టీఆర్‌నగర్‌లో ఈ నెల 2న నిందితులకు, భరత్‌నగర్‌కు చెందిన దాసరి గౌతం అలియాస్ బద్దు (20) మధ్య గొడవ జరిగింది. గతంలో జువెనైల్ అఫెండర్లకు, గౌతంకు గొడవలు జరిగాయి. గౌతంపై ద్వేషం పెంచుకున్న వారు ప్రధాన నిందితుడైన వి.మల్లేష్‌తో కలిసి గొడవపడ్డారు. అప్పటినుంచి గౌతం కదలికలను గమనిస్తూ అతడిని అంతం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 6వ తేదీ తెల్లవారుజామున నాగోల్, సాయినగర్ కాలనీలోని ఓ స్నేహితుడి ఇంట్లో ఉన్న గౌతంను బయటకు లాక్కొచ్చి కులం పేరుతో దుర్భాషలాడుతూ టెలిఫోన్ స్తంభానికి కట్టేసి విచక్షణారహితంగా కొట్టారు. బాధితుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్, రూ 15 వేలు తీసుకొని పారిపోయారు. ఈ నెల 21న గౌతం నాగోల్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌హెచ్‌ఓ స్పందించలేదు. దీంతో పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయించాడు. ఉన్నతాధికారుల ఆదేశాలతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ నెల 22న 8 మంది నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఇద్దరు జువెనైల్ అఫెండర్లను రెస్క్యూ హోంకు తరలించారు. నిందితులపై హత్యాయత్నం, కిడ్నాప్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు.